క్లుప్తంగా

21న ప్రవేశ పరీక్ష

సోంపేట: సోంపేట ఆదర్శ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో చేరేందుకు దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 21న పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చిన్నాజీ వర్మ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. వాస్తవంగా ఈ పరీక్ష 20 వ తేదీన నిర్వహిస్తున్నట్లు తొలుత ప్రకటించారు. అయితే ఆ రోజున ఈస్టర్ కావడంతో ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో పరీక్షను 21వ తేదీనికి వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ మార్పును గమనించాలన్నారు. 21న ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు.

ఆర్మీ జవాన్ నిజాయితీ


కిట్‌ను అందజేస్తున్న జవాన్ చిన్నారావు

కాశీబుగ్గ: పలాస మండలం రెంటికోట గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ వేణు యాదవ్ రూ.50 వేల విలువైన కె ఫ్లాష్ కిట్‌ను ఈ నెల ఎనిమిదో తేదీన పారేసుకున్నారు. ఇది మామిడిపల్లి గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ రాపాక చిన్నారావుకు దొరికింది. ఫ్లాష్ కిట్ పోయిన విషయాన్ని వేణు యాదవ్ సోషల్ మీడియాల్లో పోస్టు చేయగా.. దీన్ని ఆర్మీ జవాన్ చూపారు. దీంతో స్థానిక ఫొటోగ్రాఫర్ల సమక్షంలో సంబంధిత వ్యక్తికి చిన్నారావు గురువారం అందజేసి నిజాయితీని చాటుకున్నారు.

హనుమాన్ విగ్రహ ప్రతిష్ట


పూజలు చేస్తున్న భక్తులు

ఇచ్ఛాపురం టౌన్: మున్సిపాలిటీ పరిధి జర్నలిస్ట్ కాలనీలో హనుమాన్ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం గురువారం జరిగింది. పూజల్లో ఎమ్మెల్యే బెందాళం అశోక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. మంచి నీటి పైపులైను, రోడ్లు, కాలువలు ఏర్పాటు చేయాలని, సామాజిక భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక పెద్దలు ఎస్.కోటేశ్వరరావు, ఎస్.వెంకటరావు పాల్గొన్నారు.

అగ్నివీర్ ఉద్యోగానికి మేఘన ఎంపిక


మేఘన

కవిటి: ముత్యాలపేటకు చెందిన పొల్లాయి మేఘన ఈ ఏడాది జనవరిలో నిర్వహించిన నేవీ అగ్నివీర్ పరీక్షల్లో సత్తా చాటి ఉద్యోగానికి ఎంపికైంది. న్యూఢిల్లీలో జరిగిన ఇంటర్వ్యూలో మేఘన ప్రతిభ ఆధారంగా ఆమెకు ఒడిశా రాష్ట్రంలోని చిలకాలో నేవీ అగ్నివీర్ కస్టమ్స్ విభాగంలో ఉద్యోగంలో చేరింది. రాజపురం ఏపీ మోడల్ స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్మీడియెట్ పూర్తి చేసి ఆమె విజయనగరం ఎం.ఆర్.కాలేజీలో బీఎస్సీ పూర్తిచేసింది. మేఘన తండ్రి హేమారావు కవిటి మండల విద్యాశాఖలో సీఆర్పీగా పనిచేస్తున్నాడు. మేఘన ఆర్పీఎఫ్‌లో కూడా ఉద్యోగానికి అర్హత సాధించింది. అయితే ముందుగా ఇంటర్వ్యూ పూర్తిచేసి కాల్ లెటర్ రావడంతో అగ్నివీర్‌లో చేరారు.

రైల్వేగేటును ఢీకొట్టి పరార్..

కాశీబుగ్గ: కాశీబుగ్గ ఎల్సీ రైల్వే గేటును గురువారం మధ్యాహ్న సమయంలో లగేజీ ఆటో ఢీకొట్టడంతో విరిగిపోయింది. అయితే విషయం తెలుసుకున్న రైల్వే అధికారులు వచ్చేలోపు ఆటో డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. గేటు విరిగిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. పోలీసులు వచ్చి వాహనాలను క్రమబద్ధీకరించారు. కాగా రైల్వే సిబ్బంది గేటును బాగు చేయడంతో సమస్య పరిష్కారమైంది.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి


మాట్లాడుతున్న సీఐ తిరుపతిరావు

మందస:

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని కాశీబుగ్గ రూరల్ సీఐ పి.తిరుపతిరావు, మందస ఎస్సై కె.కృష్ణప్రసాద్ అన్నారు. మందసలోని బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో సంకల్పం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ.. మత్తు పదార్థాల బారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. క్రమశిక్షణ, కృషి, పట్టుదల, అంకితభావంతో మెలిగితే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు.

శక్తి యాప్ ప్రాధాన్యం, పోస్కో చట్టం గురించి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల ప్రహరీ, సీసీ కెమెరాల పనితీరు పరిశీలించారు.


పెద్దశ్రీరాంపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇలా..


పునాదులస్థాయిలో నిలిచిపోయిన నారాయణబట్టి ప్రాథమిక పాఠశాల పనులు


అర్ధాంతరంగా నిలిచిపోయిన మఠం సరియాపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల భవనం

కూటమి పాలనలో కదలని పనులు!


బూరగాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిలిచిపోయిన భవన నిర్మాణం

- నిలిచిపోయిన 'నాడు-నేడు' నిర్మాణాలు
- ఆందోళనలో విద్యార్థులు

కంచిలి:

రాష్ట్రంలోని కూటమి సర్కార్ విద్యను పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇచ్చింది. ఇందులో భాగంగా మనబడి 'నాడు-నేడు' పథకం పేరుతో ప్రభుత్వ పాఠశాలలకు అన్ని సౌకర్యాలు కల్పించింది. కార్పొరేట్‌కు దీటుగా భవనాలను నిర్మించింది. అయితే కొన్నిచోట్ల పక్కా భవనాల పనులు ఎన్నికల కోడ్ అమల్లోకి రావడం, ఇతర కారణాలతో నిలిచిపోయాయి. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ అర్ధాంతరంగా నిలిచిపోయిన భవనాలను పూర్తి చేయడాన్ని విస్మరించింది. అధికారంలోకి వచ్చి సుమారు పది నెలలైనా కనీసం వీటి వైపు అధికారులు, పాలకులు చూడలేదు. దీంతో చాలా భవనాలు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. కనీసం ఒక్క భవనానికి కూడా పూర్తి చేయలేదు. ఇచ్ఛాపురం నియోజకవర్గం పరిధి కంచిలి మండలంలో చాలా భవనాలు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ముఖ్యంగా జెడ్పీ ఉన్నత పాఠశాలల విషయానికొస్తే పెద్దశ్రీరాపురం-1, మఠం సరియాపల్లి-2, బూరగాం-1 భవనాలు అసంపూర్తి నిర్మాణాలతో దర్శనమిస్తున్నాయి. అలాగే మఠం సరియాపల్లి పంచాయతీ పరిధి నారాయణబట్టి ప్రాథమిక పాఠశాలలో ఒక భవనం పునాదుల స్థాయి నుంచి ముందుకు కదల్లేదు. జె.శాసనాం ప్రాథమికోన్నత పాఠశాలలో ఒక అదనపు తరగతి గది కూడా అసంపూర్తి నిర్మాణంతో నిలిచిపోయింది. ఇలా మండల వ్యాప్తంగా నాడు-నేడు పనులు కూటమి పాలన వచ్చిన తర్వాత పడకేశాయి. ప్రభుత్వ తీరుతో ఈ విద్యా సంవత్సరంలో చాలా పాఠశాలల్లో వసతి సమస్యతో విద్యార్థులు అవస్థలు పడ్డారు. భవన నిర్మాణాలను పూర్తి చేస్తే వసతి సమస్య తీరుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. కొన్ని పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణాలు కూడా పూర్తికాలేదు. దీంతో పిల్లలు అత్యవసర సమయంలో అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని రానున్న విద్యా సంవత్సరానికైనా భవన నిర్మాణాలు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.


జె.శాసనాం ప్రాథమికోన్నత పాఠశాలలో అర్ధాంతరంగా నిలిచిపోయిన అదనపు తరగతి గది నిర్మాణం

నిర్మాణాలు పూర్తిచేయాలి..



నాడు-నేడు పథకం కింద మంజూరైన పాఠశాలల భవనాల నిర్మాణాన్ని కూటమి ప్రభుత్వం పూర్తిచేయాలి. అర్ధాంతరంగా నిలిచిపోయిన భవనాలను సత్వరమే పూర్తిచేసి పాఠశాల యాజమాన్యాలకు అందించే ఏర్పాటు చేయాలి. ఈ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలి. -మద్దు వెంకటరావు, బూరగాం, కంచిలి మండలం

పారదర్శకంగా వ్యవహరించాలి



పాఠశాలల అభివృద్ధి విషయంలో ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాలి. గడచిన ప్రభుత్వంలో చేపట్టిన నాడు-నేడు పథకం భవన నిర్మాణాలు పూర్తి చేయాలి. రానున్న విద్యా సంవత్సరానికైనా విద్యార్థుల వసతికి ఇబ్బంది లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలి.
-పైల దేవదాస్‌రెడ్డి, ఎంపీపీ, కంచిలి

మాజీమంత్రి పరామర్శ


త్రినాథరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న అప్పలరాజు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ఐదో వార్డు పరిధి నర్సిపురం గ్రామానికి చెందిన త్రినాథరావు ఇటీవల మరణించారు. దీంతో అతని కుటుంబాన్ని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు గురువారం పరామర్శించారు. అలాగే మందస మండలం లింబుగాం గ్రామానికి చెందిన బదకల సింహాద్రి చనిపోవడంతో అతని కుటుంబాన్ని కూడా పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఎంపీపీ డొక్కరి దానయ్య, నాయకులు బమ్మిడి దుర్యోధనరావు, బత్తిని హేమేశ్వరరావు, దువ్వాడ రవి, శిష్టు గోపి, నీలాపురం నారాయణ, గొండు మోహనరావు ఉన్నారు.

పిల్లలను సర్కార్ పాఠశాలల్లోనే చేర్పించాలి


వేతనదారులతో మాట్లాడుతున్న శివరాంప్రసాద్

కంచిలి: బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని మండల విద్యాశాఖాధికారి-1 ఎస్.శివరాంప్రసాద్ అన్నారు. చొట్రాయిపురం గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్న వేతనదారులతో గురువారం సమావేశమై పిల్లలను సర్కార్ బడుల్లో చేర్పించాలని అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలు, తల్లిదండ్రులకు ఎటువంటి ఆర్థిక భారం లేకుండా ఉంటుందన్నారు. పాఠశాల హెచ్ఎం మద్దు తిరుపతిరావు, సీఆర్ఎంటీలు వజ్జ చంద్రశేఖర్, యారాడి దీనబంధు, సహోపాధ్యాయుడు చల్ల లింగమూర్తి పాల్గొన్నారు.

కళింగ కోమట్ల సంక్షేమానికి కృషి

కంచిలి: కళింగ కోమటి సామాజిక వర్గం సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు ఆ సామాజికవర్గ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోయిన గోవిందరాజులు అన్నారు. కంచిలి సంఘం ప్రతినిధులతో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓబీసీ సాధన కోసం అవిశ్రాంత కృషి చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఇప్పటికే ఢిల్లీ వెళ్లి సంబంధిత మంత్రిని కలిసి విన్నవించామన్నారు. తమ సామాజికవర్గంలోని పేదల అభ్యున్నతికి పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. కంచిలి కళింగ కోమటి సంఘం అధ్యక్షుడు ఇప్పిలి ప్రవీణ్ కుమార్, మాజీ అధ్యక్షుడు కొంచాడ సోమేశ్వరరావు, సంఘ ప్రతినిధులు ఇప్పిలి నాగేశ్వరరావు, కొత్తకోట నాగరాజు, కొంచాడ లక్ష్మణరావు, కొత్తకోట విజయబాబు, వూనా రజనీకాంత్, గుడ్ల పైడిరాజు పాల్గొన్నారు.

మాజీ సీఎం జగన్‌కు భద్రత కల్పించడంలో సర్కార్ నిర్లక్ష్యం


మాట్లాడుతున్న దుర్యోధనరావు

కాశీబుగ్గ: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి భద్రత కల్పించడంలో కూటమి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు ఆరోపించారు. పలాసలో గురువారం మాట్లాడుతూ.. జగన్ ఒంటరి కాదని.. కోట్లాది మంది అభిమానాన్ని సొంతం చేసుకున్న నాయకుడన్నారు. ప్రతినిత్యం ఆయన వెంట నడిచే లక్షలాది ప్రజల ప్రభంజనాన్ని అడ్డుకోవడం ఎవరితరం కాదన్నారు. జగన్ పర్యటనను అడ్డుకోవాలని ఎవరైనా ప్రయత్నం చేస్తే వారిని ప్రజలే తొక్కుకుంటూ వెళ్లడం ఖాయమన్నారు. ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ ప్రతినిత్యం పోరాటం చేస్తోందన్నారు.

కిడ్నీ ఆస్పత్రికి నెఫ్రాలజిస్టు నియామకం


డాక్టర్ బెందాళం గౌతమి

కాశీబుగ్గ: పలాసలోని కిడ్నీ పరిశోధన కేంద్రం, 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, డయాలసిస్ యూనిట్‌కు మరో నెఫ్రాలజిస్టును నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎండీ నెఫ్రాలజీ పూర్తి చేసిన డాక్టర్ బెందాళం గౌతమి ఈ పోస్టులో నియామకమయ్యారు. హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చదువుకున్న గౌతమి స్వగ్రామం ఇచ్ఛాపురం.

ఫీల్డ్ అసిస్టెంట్లపై కక్షసాధింపు!

- విచారణలో తిప్పికొట్టిన వేతనదారులు


ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్య తీసుకోవద్దంటూ ఏపీడీని కోరుతున్న వేతనదారులు

ఇచ్ఛాపురం రూరల్: చిరుద్యోగులపై కూటమి నాయకులు కక్ష సాధింపులకు పాల్పడుతున్నారు. ఇప్పటివరకూ ఉపాధి మేట్లను తొలగించి వారి మద్దతుదారులను నియమించుకున్న నాయకులు ఇప్పుడు ఫీల్డ్ అసిస్టెంట్లపై కక్షగట్టారు. ఇటీవల స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో జరిగిన ఉపాధి హామీ ప్రజా వేదికలో కొఠారీ పంచాయతీకి చెందిన ఏఎంసీ మాజీ చైర్మన్, టీడీపీ నాయకుడు సాడి సహదేవ్‌రెడ్డి స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్ లక్కోజీ రవికుమార్‌పై ఫిర్యాదు చేశారు. మస్టర్లలో హాజరు వేసి పనికి రానివారికి ఫీల్డ్ అసిస్టెంట్ డబ్బులు చెల్లించారంటూ ఫిర్యాదు చేసిన నేపథ్యంలో గురువారం డ్వామా ఏపీడీ చల్లా శ్రీనివాసరెడ్డి పక్షవాతంతో బాధపడుతున్న పంది మోహనరావు, సాడి బలరాంను విచారణ చేశారు. తాము పనికి వెళ్లామని విచారణలో తెలిపినప్పటికీ ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకునేలా నివేదిక తయారు చేయాలంటూ టీడీపీ నాయకుడు సహదేవ్‌రెడ్డి విచారణ అధికారిపై ఒత్తిడి చేశారు. ఈ విషయం తెలుసుకున్న వందలాది మంది వేతనదారులు అక్కడకు చేరుకొని టీడీపీ నాయకుడు సాడి సహదేవ్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాజకీయ కక్షతో ఫీల్డ్ అసిస్టెంట్ రవికుమార్ తమ్ముడు పేరున ఉన్నటువంటి రేషన్ డిపోను తొలగించారని, ఇప్పుడు తప్పుడు ఆరోపణలతో ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించేందుకు ప్రయత్నిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందంటూ టీడీపీ నాయకుడుకు వ్యతిరేకంగా నినాదాలు చేసి.. హెచ్చరించడంతో సహదేవ్‌రెడ్డి అక్కడ నుంచి జారుకున్నాడు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించడం జరుగుతుందని ఏపీడీ శ్రీనివాసరెడ్డి చెప్పడంతో వేతనదారులు వెనక్కి తగ్గారు.


ఫీల్డ్ అసిస్టెంట్ రవిపై విచారణ చేస్తున్న ఏపీడీ శ్రీనివాసరెడ్డి

అరకబద్ర ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు బింగి నీలాద్రి భార్య, అరకబద్ర ఫీల్డ్ అసిస్టెంట్ కుమారీపై వచ్చిన ఫిర్యాదు మేరకు అరకబద్ర గ్రామ సచివాలయంలో ఏపీడీ శ్రీనివాసరెడ్డి విచారణ చేపట్టారు. అయితే కుమారీపై వచ్చిన ఆరోపణలు అవాస్తంగా తేల్చారు. ఫీల్డ్ అసిస్టెంట్ కుమారీ భర్త నీలాద్రి రేషన్ షాపు డీలర్‌గా ఉండేవారు. అయితే కూటమి నాయకుల ఒత్తిడితో ఇటీవల సంబంధిత అధికారులు ఆయన్ని సస్పెండ్ చేశారు.

జాప్యం లేకుండా రెవెన్యూ సేవలు అందాలి

- జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- టెక్కలి, పలాస డివిజన్ అధికారులతో సమీక్ష


మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, పక్కనే జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తదితరులు

టెక్కలి: రెవెన్యూ సేవల్లో ఎటువంటి జాప్యం లేకుండా సకాలంలో సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. టెక్కలి ఆర్డీవో కార్యాలయం ఆడిటోరియంలో టెక్కలి, పలాస డివిజన్ రెవెన్యూ అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించి మాట్లాడారు. రెవెన్యూ సదస్సులు, రీసర్వేల్లో వచ్చిన భూముల సమస్యల అర్జీలను సకాలంలో పరిష్కరించాలన్నారు. భూముల పరిస్థితిపై క్షేత్రస్థాయి పరిశీలన చేసి తదుపరి నిర్ణయాలు తీసుకోవాలన్నారు. మ్యూటేషన్ ప్రక్రియలో ఓఆర్‌సీఎంఎస్ సాఫ్ట్‌వేర్, పీజీఆర్ఎస్‌లో వినతుల పరిష్కారం అంశాలపై రెవెన్యూ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఇంటి స్థలాలకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను స్వీకరించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలను గుర్తించాలన్నారు. గతంలో పేదలకు ఇచ్చిన ఇంటి స్థలాలపై మరోసారి దర్యాప్తు చేయాలని వెల్లడించారు. అనంతరం రెండు డివిజన్ల పరిధిలో రెవెన్యూ సమస్యలను తెలుసుకున్నారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, టెక్కలి, పలాస ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, జి.వెంకటేష్, తహసీల్దార్లు, డీటీలు, వీఆర్‌ఓలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాల అధ్యాపకుల వినూత్న ప్రచారం


డి.జి.పురంలో విద్యార్థులకు కరపత్రాలు అందజేస్తున్న అధ్యాపకులు

కంచిలి: మండల కేంద్రం కంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపక బృందం వినూత్న రీతిలో ప్రచారం చేస్తున్నారు. కార్పొరేట్ కళాశాలలకు దీటుగా టాటా మ్యాజిక్ వాహనాన్ని తీసుకొని, ఫ్లెక్సీలు కట్టి, గడచిన విద్యా సంవత్సరంలో తమ విద్యార్థులు సాధించిన విజయాలకు సంబంధించిన ఫొటోలను, మార్కులను ప్రదర్శిస్తూ మండల వ్యాప్తంగా ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వ కళాశాలలో నామమాత్రపు ఫీజులు, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, రికార్డులు, బ్యాగులు అందిస్తున్నామని, జేఈఈ, నీట్ స్టడీ మెటీరియల్ ప్రభుత్వమే అందిస్తుందని.. అందుకే సర్కార్ కళాశాలలోనే పిల్లలను చేర్పించాలని ప్రచారం చేస్తున్నారు. ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు ఆధ్వర్యంలో అధ్యాపకులు ప్రచారంలో పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన



నిరసన ప్రదర్శనలో ఆర్టీసీ సిబ్బంది

కాశీబుగ్గ: తమ సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ ఉద్యోగులు కోరారు. ఈ మేరకు నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలాస డిపో వద్ద గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఉద్యోగ భద్రతా సర్క్యులర్‌ను అమలు చేయాలని, అక్రమ సస్పెన్షన్లు, అక్రమ రిమూవల్స్‌ను ఆపాలని, నాలుగు సంవత్సరాలుగా ఆగిపోయిన ప్రమోషన్లను వెంటనే ఇవ్వాలని, గ్యారేజ్ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని, మహిళా ఉద్యోగులకు పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలని కోరారు. ఉద్యోగ సంఘ నాయకులు పిన్నింటి వాళి, డి.ఎల్. నారాయణ, ఎ.వి.రావు, టి.డి.రావు, టి. పార్వతీ శం, ఎస్ఎల్ నారాయణ, డి.సి.హెచ్.రావు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం



టెక్కలి పట్టుమహదేవి కోనేరు గట్టుపై ఉన్న వైభవ వేంకటేశ్వర ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, కల్యాణాన్ని సంప్రదాయబద్ధంగా చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. -టెక్కలి

పారిశుద్ధ్యం పనులు



వజ్రపుకొత్తూరు మండలంలోని ఉద్దానం రామక్రిష్టాపురం, కంబాల రాయుడపేట గ్రామాల్లో గురువారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టారు. సర్పంచ్‌లు చింత హేమారావు, వంక చిరంజీవి పర్యవేక్షణలో డ్రైనేజీల్లో పేరుకుపోయిన పూడికలు, చెత్తను తొలగించి గ్రామానికి దూరంగా తరలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు ఎస్.ఈశ్వరావు, మధు, మాజీ సర్పంచ్ కె.దానేసు పాల్గొన్నారు. -వజ్రపుకొత్తూరు

శామ్యూల్ హానిమన్‌కు నివాళి



ప్రజలకు హోమియోవైద్యాన్ని అందించిన పితామహుడు శామ్యూల్ హానిమన్ అని సోంపేట ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, జగతి హోమియో ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దుర్గాప్రసాద్‌పట్నాయక్ అన్నారు. కవిటి మండలం జగతిలో హానిమన్ 270వ జయంతి సందర్భంగా గురువారం ఆయన విగ్రహానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. హోమియో ప్రాధాన్యతను వివరించారు. కవిటి వైస్ ఎంపీపీ పూడి నేతాజీ, స్థానిక సర్పంచ్ పి.వరప్రసాద్, సీతారామమమూర్తి, పి.వెంకటేశం, దిక్కల బాబూరావు, పి.జోగయ్య, హరినారాయణ, బొర్ర హరి, పలువురు వైద్యులు పాల్గొన్నారు. -కవిటి

23, 24 తేదీల్లో ఆదిత్యలో జాతీయస్థాయి సాహిత్య పోటీలు

టెక్కలి: టెక్కలిలోని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 23, 24 తేదీలలో జాతీయ స్థాయి సాహిత్య పోటీలు జరగనున్నాయి. ఈ విషయాన్ని కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. డిగ్రీ, పీజీ స్థాయి విద్యార్థుల్లో దాగి ఉన్న సాహిత్య ప్రతిభను వెలికి తీసేందుకు ఇటువంటి పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఫ్లాష్ ఫిక్షన్ (200-300), స్క్రీన్ రైటింగ్ (చిన్న స్క్రీన్‌ప్లే), లిటరేచర్ క్విజ్, ఫిల్మ్ రివ్యూ ఛాలెంజ్ (ఐదు నిమిషాల సమీక్ష), డ్రామాటిక్ పెర్ఫార్మెన్స్ (నటన లేదా కవిత్వ పఠనం) కవితా రచనలు అంశాల్లో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరణ చేశారు. ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, అధ్యాపకులు రత్నమణి, ఎం.రమణయ్య, పాపినాయుడు, ఎస్.శైలజ పాల్గొన్నారు.